క్లుప్తంగా

పీడీల సమావేశం

కోవూరు : నియోజకవర్గ పరిధిలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు కోవూరు మండలం ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు పీడీలు మాట్లాడుతూ వ్యాయామ రంగంలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు ఆరోగ్యం, వ్యాయామంపై బోధించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా విద్యార్థుల్లో దాగున్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడంలో వ్యాయామ ఉపాధ్యాయులదే కీలకపాత్ర అన్నారు.

ఆరోగ్య సురక్ష క్యాంప్ పరిశీలన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చి పట్టణంలోని వవ్వేరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాంప్‌లలో రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ రమణబాబు, కౌన్సిలర్ కోటంరెడ్డి లలితమ్మ, నాయకులు కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పురస్కారాల ప్రదానం



ఇందుకూరుపేట: మండలంలోని కొత్తూరు శ్రీ లలితా మహేశ్వరి ఆశ్రమంలో పీఠాధిపతులు, వేద పండితులు, అర్చకులకు కామధేను పురస్కారాలను బుధవారం అందజేశారు. టీటీడీ పూర్వ ఈఓ కేవీ రమణాచారి జన్మదినం పురస్కరించుకుని బహుముఖ కళాకారుడు మైపాడు రాజా ఆధ్వర్యంలో ఆశ్రమ పీఠాధిపతి రామాయణం మహేష్‌స్వామి పర్యవేక్షణలో పలు రాష్ట్రాలకు చెందిన వారికి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మహేష్‌స్వామి మాట్లాడుతూ ధార్మికసేవలు అందించడం అదృష్టమన్నారు. శ్రీహరి దాసు(మహారాష్ట్ర), శివంగార్గ్(ఉత్తరప్రదేశ్), రామదొరై శర్మ(తమిళనాడు), సురేష్ తివారి(మధ్యప్రదేశ్), హరితసానంద(నెల్లూరు), రామదాసు శ్రేయంషు మహరాజ్(తెలంగాణ), అనిరుధ్ కులకర్ణి(తెలంగాణ), రావూరి మల్లికార్జున శర్మ(పెంచలకోన), దార్వేములు గురుబ్రహ్మశాస్త్రి(ఒంగోలు), రామాయణం హరీష్‌శర్మ(పడుగుపాడు) పురస్కారం అందుకున్న వారిలో ఉన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ఆంధ్రా బ్యాంక్ వీధిలో నివాసం ఉంటున్న సీహెచ్ రాజేశ్వరి తన భర్త కనిపించడం లేదని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. గతనెల 25న స్థానిక గ్రంథాలయంలో విధులకు హాజరైన తన భర్త చార్మణయ్య అదేరోజు నుంచి అదృశ్యమయ్యాడని భార్య రాజేశ్వరి పోలీసులకు తెలియజేసింది. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేంద్ర తెలిపారు.

గ్రామాల్లో నాటుకోళ్ల మృతి

పొదలకూరు : మండలంలోని పలు గ్రామాల్లో నాటుకోళ్లు మృతి చెందుతున్నాయి. బర్డ్‌ఫ్లూ వైరస్‌తో మహ్మదాపురం, చాటగొట్ల, పార్లపల్లి తదితర గ్రామాల్లో పౌల్ట్రీ పరిశ్రమ దెబ్బతింది. ఫలితంగా ఫామ్‌లలో వేల సంఖ్యలో కోళ్లు మృతి చెందాయి. దీంతో ప్రభుత్వ యంత్రాంగం నివారణ చర్యలు చేపట్టింది. జాతీయ వైద్యారోగ్య సంస్థ వైద్యులు సైతం చాటగొట్ల గ్రామానికి వచ్చి గ్రామస్తుల నుంచి రక్తనమూనాలు సేకరించారు. అయితే గ్రామాల్లో నాటుకోళ్లు పెంచుకుంటున్న వారి ఇళ్లలో నాలుగురోజులుగా కోళ్లు మృతి చెందుతున్నాయి. బర్డ్‌ఫ్లూ ప్రభావమా లేక మరేదైనా కారణమా తెలియాల్సి ఉంది. అయితే మనుషులకు బర్డ్‌ఫ్లూ సంక్రమించినట్లు సమాచారం లేదు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు : మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్టులో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ప్రాజెక్టు ఇంజినీర్లు బుధవారం తెలిపారు. ఇందులో భాగంగా ఒకటో యూనిట్లో 370 మెగావాట్లు, రెండో యూనిట్లో 390 మెగావాట్లు, మూడో యూనిట్లో 550 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు వెల్లడించారు.

సంతృప్తికరంగా ఉపాధి పనులు

తోటపల్లిగూడూరు : జిల్లాలో ఉపాధి హామీ పనులు సంతృప్తికరంగా సాగుతున్నట్లు డ్వామా పీడీ వెంకటరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సోషల్ ఆడిట్ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ గడిచిన ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో రూ.12.13 కోట్లతో ఉపాధి పనులను పకడ్బందీగా చేపట్టినట్లు వివరించారు. మండలానికి సంబంధించి ఈ ఏడాదిలో 99 శాతం పనులు సంతృప్తికర స్థాయిలో సాగాయన్నారు. రూ.92 వేల రికవరీకి అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సౌత్‌ఆములూరులో రికార్డుల నిర్వహణ లోపం కారణంగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను హెచ్చరించామని, మల్లికార్జునపురంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణల నేపథ్యంలో నోటీసు జారీ చేశామన్నారు. అంబుడ్స్‌మెన్ వెంకటరెడ్డి, ఏపీడీ శ్రీహరిరెడ్డి, ఎంపీడీఓ ప్రత్యూష, ఎస్‌ఆర్‌పీ వెంకయ్య, జెడ్పీటీసీ ఎంబేటి శేషమ్మ, ఏపీఎం అచ్చయ్య, టీఏ రమేష్ పాల్గొన్నారు.



మనుబోలు తూర్పువీధిలో నూతనంగా వేసిన సీసీరోడ్డు



మనుబోలు- కోదండరామపురం మధ్య వేసిన డ్రైయిన్

అభివృద్ధి జోరు.. సంక్షేమ హోరు

- మారిన మనుబోలు రూపురేఖలు
- గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రగతి పనులు

మనుబోలు : దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రగతి బాట పట్టాయి. ఊరూరా సీసీరోడ్లు, సైడు డ్రెయిన్లు, సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మాణమయ్యాయి. నవరత్నాల పేరుతో వివిధ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. రాజకీయ పార్టీల ప్రమేయం, వివక్షకు తావు లేకుండా వలంటీర్లు, సచివాలయ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుండడంతో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి బాటలు వేశారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది.



మనుబోలు బిట్-1 గ్రామ సచివాలయం



నేరుగా సంక్షేమ ఫలాలు

మనుబోలు బిట్-1 సచివాలయ పరిధిలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో డీబీటీ(డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా రూ.19 కోట్ల 22 లక్షల 59 వేల 163 నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమైంది. జగనన్న అమ్మఒడి, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ మత్స్యకార భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, కాపు నేస్తం, నేతన్న నేస్తం, హౌసింగ్‌కు చెల్లింపులు, జగనన్న చేదోడు తదితర 33 పథకాల ద్వారా ఈ నగదు జమ చేశారు.

మనుబోలు బిట్-1 సచివాలయ పరిధిలో..
డీబీటీ ద్వారా లబ్ధిదారులకు జరిగిన మేలు రూ. 19,22,59,163
నాన్ డీబీటీ ద్వారా జరిగిన మేలు రూ. 8,21,30,438
మొత్తం: రూ. 27,43,89,601

అభివృద్ధి పరవళ్లు

కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా అభివృద్ధి పనుల్లో కూడా ప్రభుత్వం దూసుకుపోతోంది. ఒక్క మనుబోలు సచివాలయం బిట్-1 పరిధిలోనే రూ.8,21,30,438తో సీసీరోడ్లు, మురుగు కాలువలు, సచివాలయం, ఆర్బీకే తదితర నిర్మాణాలు చేపట్టారు. ఇవే కాకుండా లక్షలాది రూపాయలు వెచ్చించి పొలాల్లో 11 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు, మనుబోలు నుంచి పశువులు పొలాలకు వెళ్లేందుకు హైవే కింద నుంచి డొంకను ఏర్పాటు చేశారు.

సొంతింటి కల నెరవేరింది



ఎన్నో సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఇన్నాళ్లకు జగనన్న ప్రభుత్వం మాకు ఇంటి స్థలం కేటాయించడమే కాకుండా ఇంటిని నిర్మించుకునేందుకు ఆర్థిక స్తోమత కల్పించింది. సొంత ఇల్లు నిర్మించుకుని గృహ ప్రవేశం కూడా చేశాం. లేఅవుట్‌లలో తాగునీటి వసతి, కరెంటు తదితర వసతులన్నీ ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఇన్నాళ్లకు సొంతింటి కల నెరవేరినందుకు సంతోషంగా ఉంది.

– చింతల జయశీల, లబ్ధిదారు

ఎన్నో ఏళ్లకు సీసీరోడ్డు వచ్చింది



మా వీధి ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా ఉండేది. దీంతో వాహనాల రాకపోకలకు, పాదచారులకు చాలా ఇబ్బందిగా ఉండేది. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీసీరోడ్డు వేసి సుందరంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఎంతో సౌకర్యంగా ఉంది. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– రాయి మధుసూదన్, మనుబోలు

రుణపడి ఉంటాం



కొన్నేళ్ల క్రితం నాకు పక్షవాతం వచ్చింది. అప్పటి వరకూ వ్యవసాయ పనులు చేసుకునే నేను తరువాత ఏ పని చేయలేకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. దీనికితోడు నా కుమారుడికి కిడ్నీ సమస్య ఉండడంతో వారానికి మూడు రోజులు డయాలసిస్ చేయాల్సి వస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి జగనన్న సీఎం అయ్యాక నాకు రూ.5 వేలు, నా కుమారుడికి రూ.10 వేలు పెన్షన్ అందుతోంది. జగనన్నే లేకుంటే మా కుటుంబ పరిస్థితి ఏమయ్యేదో అనిపిస్తోంది. ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటాం.

– పోలంరెడ్డి మల్లీశ్వరి, మనుబోలు

రూ.14.5 కోట్లతో పనులు



కేవలం మనుబోలులోనే 57 నెలల కాలంలో మా డిపార్ట్‌మెంట్ ద్వారా రూ.14.5 కోట్ల విలువైన పనులు చేశాం. రూ.12 కోట్లతో మురుగు కాలువల నిర్మాణం, రూ.1.5 కోటితో జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామంలో తాగునీటి వసతి, మరో రూ.కోటితో జగనన్న లేఅవుట్‌లలో తాగునీటి వసతి ఏర్పాటు చేశాం. గతంలో ఎప్పుడూ ఇంత స్థాయిలో నిధులు ఖర్చు చేయలేదు.

– కార్తీక్‌రెడ్డి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

కలెక్టర్ పరిశీలన



కోవూరు : మండలంలోని గంగవరంలో ఉన్న గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలను, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను కలెక్టర్ ఎం.హరినారాయణన్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ బుధవారం పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పీఓ, ఏపీఓల శిక్షణ కోసం గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలను, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, ఈవీఎంల స్ట్రాంగ్ రూముల కోసం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల పరిశీలన చేశారు. ఈఆర్వో శ్రీనివాసులు, తహసీల్దార్ విజయశ్రీ, డీటీ జమీర్, మధుసూదన్‌రావు ఉన్నారు.

నేడు చెముడుగుంటకు మంత్రి కాకాణి రాక

వెంకటాచలం : మండలంలోని చెముడుగుంట గ్రామానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం రానున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానికంగా ఉన్న ఫ్రీడ్స్ కల్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని వివరించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

పొదలకూరు : యువత ఓటు హక్కును వినియోగించుకోవాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా కన్వీనర్ ఎ.మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. కండలేరు డ్యామ్ కామాక్షి మహిళామండలి ఆధ్వర్యంలో స్థానిక కాకతీయ డిగ్రీ కాలేజీలో ఓటుహక్కు వినియోగంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గ్రామాల్లో ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. మహిళా మండలి అధ్యక్షురాలు రమణమ్మ, వలంటీర్లు శోభన్‌బాబు, హరీష్‌కుమార్, కాలేజ్ ప్రిన్సిపల్ రఫీ పాల్గొన్నారు.

స్థల పరిశీలన

కోవూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్టు ద్వారా రూ.4 లక్షల వ్యయంతో సరస్వతీదేవి విగ్రహ ఏర్పాటుకు ట్రస్టు చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, అతని సోదరుడు మల్లికార్జునరెడ్డి బుధవారం స్థల పరిశీలన చేపట్టారు. విగ్రహాన్ని ఆళ్లగడ్డ నుంచి తీసుకొచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. పాఠశాల హెచ్‌ఎం నరసింహమూర్తి, ట్రస్టు సభ్యులు శేఖర్‌స్వామి, జగదీష్, శ్రీకాంత్ ఉన్నారు.

జగనన్నకు అండగా నిలవాలి



పురస్కారం అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు : రాబోయే ఎన్నికలు పేదలకు పెత్తందారులకు మధ్య జరుగుతుందని, అన్నివర్గాలకు మేలు చేసిన జగనన్నకు ప్రజలు అండగా నిలవాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా బుధవారం పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నట్లు వెల్లడించారు. మండలంలో ఒక వలంటీర్‌కు సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 278 మందికి సేవామిత్ర పురస్కారాలను ప్రదానం చేయడం గర్వంగా ఉందన్నారు. కరోనా సమయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మండల స్థాయి అధికారులు ప్రజలకు అండగా నిలబడి, జగనన్న ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చారని తెలిపారు. ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రాణాలకు భయపడి ఇళ్లల్లోనే ఉన్నారన్నారు.

పేదల గుండెల్లో వైఎస్సార్

ఆరోగ్యశ్రీ ద్వారా దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు కార్పొరేట్ వైద్యం అందించి, వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఘనత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే ప్రసన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి ఆరోగ్యశ్రీ కార్డులు అందజేశారు. కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు సౌందర్య, శ్రీనివాసులు నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, కొండూరు వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, మురళీరెడ్డి, సురేంద్రరెడ్డి, తిరుపతయ్య, శీనయ్య, పోలయ్య, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆదరించని గ్రామాల్లోనూ అభివృద్ధి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మెజారిటీ లభించని గ్రామాల్లో సైతం విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నేదురుమల్లి గ్రామంలో రూ.77 లక్షలతో పూర్తి చేసిన సిమెంటురోడ్లను మంత్రి కాకాణి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ నేదురుమల్లి గ్రామంలో 2019 ఎన్నికల్లో తనకు మెజారిటీ తగ్గిందన్నారు. అయినప్పటికీ ఈ ప్రాంతంలో తన సొంతూరి వలే రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ ఒక్క గ్రామంలోనే రూ.4.50 కోట్ల అభివృద్ధి పనులతో పాటు 406 ఎకరాల అసైన్మెంట్ భూములను పంపిణీ చేసినట్లు తెలిపారు. చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం చూపామని, పక్కా ఇళ్లకు వెంటనే బిల్లులు అందజేశామన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు కనుపూరు కాలువ పక్కన తారురోడ్డు నిర్మాణ పనులను తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేపడుతామని హామీ ఇచ్చారు.



సిమెంటురోడ్లను ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సోమిరెడ్డిపై పోటీ చేయడం దురదృష్టం

టీడీపీ నేత సోమిరెడ్డిపై పోటీ చేయడం తన దురదృష్టంగా భావిస్తానని మంత్రి కాకాణి అన్నారు. కరెన్సీ నోట్లపై ఉన్న మోజు పేదల సమస్యలపై సోమిరెడ్డికి ఉండదన్నారు. నేదురుమల్లి గ్రామస్తులు సోమిరెడ్డికి ఓట్లు వేస్తే కరోనా కష్టకాలంలో ఎక్కడ దాక్కున్నాడో చెప్పాలన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని అయినా నాయకుడు పేదల అభివృద్ధి కోసం పాటుపడాల్సిందిగా పేర్కొన్నారు. మంత్రి రాక సందర్భంగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు టి.పెంచలనాయుడు, సర్పంచ్ ఉడాతా రమేష్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు సీహెచ్ చంద్రమౌళి, వెంకటరమణయ్య, నాయకులు కె.రవి, నాగయ్య, తహసీల్దార్ కె.వీరవసంతరావు, ఎంపీడీఓ మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.

డీఎల్ఎన్నార్‌లో మాతృభాషా దినోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాలలో ప్రజాసత్తా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ప్రజాసత్తా అధ్యక్షుడు శోభన్‌బాబు మాట్లాడారు. మాతృభాష ఆవశ్యకతను ప్రతిఒక్కరూ గుర్తించాలని కోరారు. ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తూనే మాతృభాషపై మక్కువ పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతల దయాకర్, హెచ్‌ఎం రవీంద్రబాబు, ఉపాధ్యాయుడు మాధవరావు, సుమలత, ఆదిలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజాసత్తా నాయకుడు శోభన్‌బాబు

నావూరురోడ్డు పనులకు శంకుస్థాపన

- రూ.14.45 కోట్లతో పనులు

పొదలకూరు : మండలంలోని నావూరురోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. 23 కి.మీ మేర చేజర్ల మండలం కొండలరాయుడుకండ్రిక వరకు రూ.10.83 కోట్లు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.62 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభమవుతాయని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. పీఆర్ ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈ శ్రీనివాసరావు, ఏఈ మవేక్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌రెడ్డి, పి.లచ్చారెడ్డి, బి.నరసింహులు, నీలం మాల్యాద్రి, పి.పెంచలప్రసాద్, సీహెచ్ రమేష్ పాల్గొన్నారు.

అసత్యాలు రాస్తే సహించం

విడవలూరు: మండలంలోని రామతీర్థం పంచాయతీ రామలింగాపురంలో కోళ్ల పందేలు నిర్వహిస్తున్నామని ఓ పచ్చపత్రికలో అసత్యాలు రాయడం సబబు కాదని గ్రామస్తులు అన్నారు. ఈ మేరకు సున్నపు తిరుపతయ్య, సుధాకర్, కె.హరిబాబు బుధవారం గ్రామంలో విలేకరుల సమవేశం నిర్వహించారు. తాము ఎలాంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడడం లేదని, మత్స్యకారులపై తప్పుడు కథనాలు తగవన్నారు. మరోసారి మాపై తప్పుడు కథనాలు రాస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడ గ్రామంలో హెచ్ఐవీ నియంత్రణపై జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. కళాజాత ద్వారా ఎయిడ్స్ నివారణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ



కోవూరు : స్థానిక జెట్టి బలరామిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం శ్రీహరి మాట్లాడుతూ విద్యార్థి జీవితానికి పదో తరగతి పునాది వంటిదన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని ఇష్టపడి చదవాలన్నారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి

కొడవలూరు : గర్భిణులు తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. మండలంలోని యల్లాయపాళెం 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు ఆహ్వానం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు పాటించకుంటే రక్తహీనత తలెత్తుతుందన్నారు. ఫలితంగా కాన్పు కష్టతరంగా మారుతుందని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని సమృద్ధిగా తీసుకోవడంతో పాటు మార్కెట్‌లో తక్కువ ధరకే లభ్యమయ్యే పోషక విలువలున్న ఆహారాన్ని వినియోగించాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మహిళా పోలీసు హెప్సిబా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఐ.సుకవేణి, ఐ.ధనమ్మ, ఐ.కవిత, ఎ.జ్యోత్స్న, ఆర్.నీరజ, ఐ.విజయ, ఆర్.రాధమ్మ పాల్గొన్నారు.



చిన్నారులకు అన్నప్రాసన చేయిస్తున్న పద్మావతి

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

- ఇరిగేషన్ డీఈ మధుసూదన్

కొడవలూరు : సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ఇరిగేషన్ డీఈ ఎస్.మధుసూదన్ రైతులకు సూచించారు. కొడవలూరు ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమశిల జలాశయంలో నీటి నిల్వ పరిమితంగా ఉన్నందున పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నీటి యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నీటిని పొదుపు చేయాలని చెప్పారు. సాగునీటి కాలువల పైభాగాన ఉన్న రైతులు నీటిని ఇబ్బడిముబ్బడిగా వినియోగిస్తే చివరి ఆయకట్టు రైతులకు నీరందని పరిస్థితి ఏర్పడుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులంతా సహకరించాలని కోరారు. సమావేశంలో కొడవలూరు ఇరిగేషన్ ఏఈ పి.పార్థసారథి, బుచ్చి ఏఈ ఈ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈ మధుసూదన్